# కొత్త రూపాయి

**వారణాసి రామకృష్ణ**




అనగనగా ఓ కొత్త రూపాయి! అప్పుడే టంకసాల నుండి బైటికొచ్చి ఓ జాతీయ బ్యాంక్ క్యాష్ కౌంటర్‌లోకి చేరింది. అది తళతళలాడుతున్న తన ఒంటికేసి చూసుకుని తెగ మురిసిపోయింది! ఈ లోకంలో అందరూ తనకి వంగివంగి దండం పెడతారన్న గర్వంతో ఉంది.

కౌంటర్లో కూర్చున్న క్యాషియరు కస్టమర్లందరికీ నోట్లనే ఇస్తోంది కానీ రూపాయి బిళ్ళ జోలికి వెళ్ళలేదు. దాంతో రూపాయికి ఆమె తనని ఎంత మురిపెంగా ముద్దుగా చూసుకుంటోందోనని మరింత హుషారుగా గలగలమని నవ్వింది.

ఇంతలోనే క్యాషియరు తనని సుతారంగా చేతుల్లోకి తీసుకుని ఓ వ్యక్తికిచ్చింది. రూపాయి బిళ్ళ ఆ వ్యక్తికేసి పరిశీలనగా చూసి మరింత గర్వంతో నవ్వుతూ ఆమెకి టాటా చెప్పేసి పెద్ద మనిషి కోటు జేబులోకెక్కి వెచ్చగా కూర్చుంది. అతను బ్యాంక్‌లోంచి బైటికొచ్చి ఎ.సి కారులో కూర్చున్నాడు.

రూపాయి ఆనందంతో తబ్బిబ్బయింది. చల్లగా ఎంతో సౌకర్యంగా ఉన్న ఆ కారు ప్రయాణం దానికి మరింత గర్వాన్ని తలకెక్కించింది! తన విలువ మీద తనకే ఈర్ష్య పుట్టింది!

వేగంగా వెళ్తున్న ఆ కారు ఓ స్టార్ హోటల్ ముందు ఆగింది. ధగధగమెరిసిపోతున్న ఆ హోటల్ సోయగాలను రూపాయి వింతగా చూస్తూ తన లాంటి ఎన్ని రూపాయిలు కలబోస్తే ఈ సుందర సౌధం తయారయిందానని అనుకుంటూ హోటల్‌లోనికెళ్ళింది.

కారులో వచ్చిన వ్యక్తి అక్కడ మరోవ్యక్తిని కలిశాడు. ఇద్దరూ చాలాసేపు బిజినెస్ విషయాలు చర్చించారు. వాళ్ళ మాటల్లో మూడొంతులకి పైగా వాళ్ళు ఉపయోగించిన పదం- "రూపాయి!!" దాంతో రూపాయి ఆనందానికి పట్టపగ్గాల్లేవు. తన విలువ తన ప్రాముఖ్యం తెలిసిన కొద్దీ అతిశయం పెరిగింది.

హోటల్‌లో వాళ్ళిద్దరూ భోజనం చేశాక అతను మరికొన్ని నాణేలతోబాటు కొత్త రూపాయినీ అక్కడే వదిలేసి వెళ్ళిపోయాడు.

అంతసేపూ అంత అపురూపంగా తనని చూసుకున్న వ్యక్తి వెళ్ళిపోతుంటె కొత్తరూపాయికి గుండెల్లో కలుక్కుమంది! విషాదంగానే వీడ్కోలు పలికింది కానీ ఆ స్టార్ హోటల్‌లో తన వైభవం గుర్తొచ్చి మళ్ళీ హుషారుగా కిలకిలమని నవ్వింది.

నవ్వు పూర్తయ్యేలోగానే వెయిటర్ రూపాయిని కాస్తా మరో వ్యక్తికిచ్చేశాడు. అతను వక్కపొడి నములుతూ హోటల్ లోంచి బైటికొచ్చేసరికి రూపాయికి ఎండపొడ తగిలి ఒక్కసారిగా ఈష వచ్చినంత పనయింది.

ఆ వ్యక్తి సరాసరి కిల్లీ కొట్టు దగ్గరికొచ్చి రూపాయిని కొట్టువాడికిచ్చేసి సిగరెట్ కొనుక్కుని వెళ్ళిపోయాడు.

గల్లాపెట్టెలో పడ్డ కొత్త రూపాయి ఉక్కిరిబిక్కిరయింది. ఒకప్రక్క నుంచి పాత నోట్ల కంపు! మరో వైపు మకిలిపట్టిన నాణేల వాసన! దీనికితోడు సిగరెట్ల ఘాటు! పడి పడి నరకంలో పడ్డానని రూపాయి దిగులు పడి విచారించేలోపలే దాన్నెవరో మళ్ళీ జేబులో వేస్కున్నారు. ఆ వ్యక్తి రూపాయిని తీసుకెళ్ళి తన గుడిసెలో చూరుకి కట్టిన పాత మూటలో వేశాడు. అక్కడ అది మూడు భయంకర రాత్రులని చవిచూసింది. నాలుగోరోజు ఆ వ్యక్తి మూటవిప్పి కొత్త రూపాయిని తీసి రిక్షా అతనికిచ్చాడు.

రిక్షా అతను దాన్ని ఆరోజు తన రిక్షాలో ప్రయాణించిన మేస్త్రీకిచ్చాడు. మేస్త్రీ సూపర్‌వైజర్‌కి, సూపర్‌వైజర్ ఇంజనీరుగారికి అలాఅలా రూపాయి చేతులు మారుతూ నానాయాతనలు పడుతూ చిక్కి శల్యమయి చివరికి ఎవరో గుడి దగ్గరికొచ్చి దండం పెడదామని వంగే సరికి అతని జేబులోంచి జారి గుడిమెట్ల మీద పడింది. అతను వెతికే ప్రయత్నం చెయ్యబోగా అతని భార్య రుసరుసలాడుతూ "పోతెపోయిందిలెండి- వెధవ రూపాయి! ఇప్పుడు దానికోసం వెతుకుతూంటే అవతల గుడి తలుపులు మూసేస్తారు" అంటూ అతన్ని కాస్తా చెయ్యి పట్టుకుని లాక్కుపోయింది.

కాస్సేపటి తర్వాత అక్కడికొచ్చిన బిక్షగాడి కాలు తగిలి రూపాయి ఖణేళ్‌మని రోదించింది. ఆ శబ్దానికి బిక్షగాడు ఉలిక్కిపడి చూసి వంగి రూపాయిని చేతిలోకి తీసుకున్నాడు. ఇంతలో ప్రక్కనున్న తోటి బిక్షగాడు "ఏంట్రా అది?" అడిగాడు. "రూపాయన్నా! కొత్త రూపాయి బిల్ల!!" అంటూ జోలెలో వేసుకోబోగా అతను చెయ్యి పట్టుకుని -

"వొరే... మనం రూపాయి బిల్ల ఎవుడు దానం సేసినా తీస్కోకూడదని మొన్నం మనం పెట్టుకున్న సంఘం సభలో అనుకున్న విసయం అప్పుడే మర్సిపోయినావా? సీ!సీ! దిక్కుమాలిన ఈ రూపాయి బిల్లని ఎవుడో గుల్లో దిట్టె తీసి పారేశాడ్రా- దాన్ని అంటుకోమాక- అన్నాయంగా దరిద్రం సుట్టుకుని సచ్చిపోతావు!"

భయపెట్టేసరికి బిక్షగాడు కొత్త రూపాయిని బలంగా చీకట్లోకి విసిరేశాడు!

అది గుడిమెట్లమీద నుంచి దొర్లుతూ... దొర్లుతూ వేగంగా క్రిందికి రాసాగింది! క్రిందికి దిగజారిపోతున్న ఆ సమయంలో రూపాయికి ఆత్మ పరిశీలన చేసుకోవటం అనివార్యమైంది!

"ఎంత ఎత్తునుంచి పడిపోతున్నాను! ఎన్నివిధాలుగా 'పతనం' అవుతున్నాను! ఒకప్పటి తళతళలు ధగధగలు మెరుపులు చూసి విర్రవీగాను! ఆఖరికి నా విలువ ఇలా పడిపోవటానికి కారణం ఎవరు? ఏమిటి?"

- పరిశీలన పూర్తి కాకుండానే కొత్త రూపాయి చివరి మెట్టుని బలంగా తాకి రివ్వుమని గాల్లోకి ఎగిరి అమాంతం రోడ్డు పక్కనున్న చెత్తకుండీలోకి జారిపోయింది!!

## పోలీసు అంటే...?

*పోలీసుల గురించి మన చిన్నప్పట్నించి వింటున్నాం. కాని అసలు పోలీసు అనే పదం ఎలా పుట్టింది? పోలీసు అనే వ్యవస్థ ఎలా వచ్చిందనే విషయం మాత్రం చాలా మందికి తెలియదు. పోలీస్ అనే పదం గ్రీకు భాష నుంచి వచ్చింది. గ్రీకు భాషలో పోలీసు అంటే నగరం అని అర్థం. ప్రాచీన రోమ్ నగరంలో పోలీసు పనులు నిర్వహించిన అధికారులను 'లిక్టోర్స్' అని పిలిచేవారు. లండన్ నగరంలో 1829లో సర్ రాబర్ట్ పీల్ ఆధునిక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశాడు. ఈ సిబ్బందిని స్కాట్‌లాండ్ యార్డ్ పోలీస్‌గా పిలిచేవారు. న్యూయార్క్ నగరంలో 1844లో పోలీస్ సిబ్బందిని నియమించారు. మన దేశంలోకి బ్రిటిష్ వారి హయంలో పోలీసు వ్యవస్థ వచ్చింది. ఆధునిక పోలీసులకు శాంతిభద్రతలు, ట్రాఫిక్ పర్యవేక్షణ వంటి అనేక క్లిష్టమైన విధుల్ని నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అనేక ఆధునాతన పరికరాల్ని, వాహనాల్ని వినియోగిస్తున్నారు. క్రీస్తు పూర్వం రోమ్ నగరంలో ఉన్న పోలీసు వ్యవస్థకు, నేడు ఉన్న పోలీసు సిబ్బందికి మధ్యన పోలికే లేదు.*